RNI NO :Title-Code :-TELTEL02102
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 177 ఆదివారం 24 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ శంఖారావం!



4లో.

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103





## రష్యా ప్రభుత్వానికి, ప్రజలకు
# అండగా ఉంటాం

- రష్యాలో ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన ప్రధాని మోదీ
- రష్యా రాజధాని మాస్కోలో ఉగ్రవాదుల నరమేధం
- 60 మందికి పైగా మృత్యువాత, మరో 140 మందికి గాయాలు
- ఈ ఘటనపై ఎక్స్ వేదికగా స్పందించిన మోదీ
- ఈ దాడికి పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ప్రకటన

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**రష్యా రాజధాని మాస్కోలో శుక్రవారం రాత్రి ఉగ్రవాదుల నరమేధానికి పాల్పడ్డారు. క్రాకస్ సిటీ కన్సర్ట్ హాల్‌లోకి ఆయుధాలతో ప్రవేశించిన ఉగ్రవాదులు విచక్షణరహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో 60 మందికి పైగా చనిపోగా, మరో 140 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' (గతంలో ట్విటర్) వేదికగా స్పందించారు. ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. రష్యా ప్రభుత్వానికి, ప్రజలకు సంఘీభావం తెలియజేశారు. "మాస్కోలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. మా ఆలోచనలు, ప్రార్థనలు వారితోనే ఉంటాయి. ఈ విపత్కర సమయంలో రష్యా ప్రభుత్వానికి, రష్యన్ ఫెడరేషన్ ప్రజలకు అండగా ఉంటాం" అని మోదీ ట్వీట్ చేశారు. కాగా, ఈ దాడికి పాల్పడింది తామేనని ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ ప్రకటించింది.

## అభ్యర్థుల ఖర్చుపై
# ఈసీ ఫోకస్



- రేట్ల వివరాలు వెల్లడించిన ఎన్నికల కమిషన్
- సమోసా నుంచి బిర్యానీ వరకు, బైక్ నుంచి బస్సుల దాకా
- మైక్ సెట్ నుంచి మ్యాన్ పవర్ వరకు
- టీ నుంచి పబ్లిసిటీ వరకు ఖర్చుల నియంత్రణ
- లెక్క ఇంతే చూపాలి.. లిస్ట్ రిలీజ్ చేసిన ఈసీ





**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:** దేశంలో లోక్‌సభ, పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి ఓటింగ్ ఏప్రిల్ 19న, ఎన్నికల ఫలితాలు జూన్ 4న ఉండబోతున్నాయి. కాగా, ఎన్నికల ఖర్చులను నియంత్రించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) శనివారం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా మేజిస్ట్రేట్‌తో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈఓలు) ఏరియాను బట్టి అభ్యర్థుల ఖర్చులను నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సీఈవోలందరూ ఎన్నికల సంఘానికి నివేదికలు పంపారు. నీళ్ల నుంచి పటాకుల వరకు, టీ నుంచి పబ్లిసిటీ వరకు ఖర్చుపై పరిమితి విషయంలో అభ్యర్థులు నిబంధనలు పాటించగలరా లేదా అనేది చూడాలన్నారు. అలాగే కమిషన్ ముందు ఎన్ని ఉల్లంఘన కేసులు వస్తున్నాయో పరిశీలించాలని ఆదేశించారు.అభ్యర్థులు ప్రతి పైసా బిల్లును, లెక్కను ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సి ఉంటుంది. కమిషన్ సూచనల మేరకు జిల్లా స్థాయిలో అభ్యర్థులకు వస్తువుల ధరల జాబితాను విడుదల చేశారు. ఇందులో అభ్యర్థుల ఖర్చు రేట్లను కూడా ఖరారు చేశారు. ఈసారి యూపీలో టీ, సమోసా ధర రూ.10గా నిర్ణయించగా, జిలేబీ ధర కిలో రూ.150గా ఉంచారు. సింగిల్ నాన్ ఏసీ గది ధర రూ.1150, డబుల్ బెడ్ రూ.1550గా నిర్ణయించారు. **మిగతాది 2లో...**

## రేవంత్ రెడ్డీ.. నీస్థాయిని నీవే తగ్గించుకుంటున్నావ్...

- ఇవన్నీ చెబుదామంటే టైమ్ ఇవ్వడంలేదు : వీహెచ్ షాకింగ్ కామెంట్స్
- బీఆర్ఎస్ నేతల ఇళ్లకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానించడం సరికాదన్న వీహెచ్
- వారిని పార్టీలోకి తీసుకొని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం చేయవద్దని విజ్ఞప్తి
- పార్టీని బలోపేతం చేసి నాలుగేళ్లలో సీఎం అయ్యారంటూ ప్రశంసలు



2లో.

## దమ్ము చూపే అవకాశం
# ఇప్పుడే నీకే

- దమ్ముందా? అని ఆనాడు అడిగావ్ కదా రేవంత్ రెడ్డీ...
- ఆ దమ్ము చూపే అవకాశం ఇప్పుడే నీకే వచ్చింది: కిషన్ రెడ్డి
- ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కోరగలరా?
- కేజ్రీవాల్ అరెస్టును కాంగ్రెస్ వాళ్లు ఖండిస్తున్నారని...
- కుంభకోణాల పార్టీ ఇలా చేయడంలో ఆశ్చర్యం లేదని ఎద్దేవా
- మాటలతో పూట గడిపే ప్రయత్నమని మండిపాటు



2లో.

## మరో మూడు లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బి ఆర్ ఎస్

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:** భారత రాష్ట్ర సమితి మరో మూడు లోక్ సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. నల్గొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పేరును ప్రకటించింది. ఇక భువనగిరి నియోజకవర్గ అభ్యర్థిగా నుంచి క్యామ మల్లేశ్ పేర్లను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫైనల్ చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్ పేరును కేసీఆర్ ప్రకటించారు. శాసన సభ్యులు ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో చర్చించి అందరి అభిప్రాయం సేకరించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అందరి ఏకాభిప్రాయం మేరకు ముగ్గురు అభ్యర్థులను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు.రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలకు బీఆర్ఎస్ పార్టీ 16 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా హైదరాబాద్ పార్లమెంట్‌కు అభ్యర్థిని ప్రకటించాలి ఉంది. నాగర్‌కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వర్ రావు, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత, మల్కాజ్‌గిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, వరంగల్ నుంచి కడియం కావ్య బరిలో ఉన్నారు.



క్యామ మల్లేశ్ | కంచర్ల కృష్ణారెడ్డి | తిగుళ్ల పద్మారావు

# ఇది రాజకీయ కేసు
## న్యాయపోరాటం చేస్తా : ఎమ్మెల్సీ కవిత

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ విచారణపై ఎమ్మెల్సీ కవిత అసహనం వ్యక్తంచేశారు. ఏడాది నుంచి అడిగిన వివరాలే మళ్లీ మళ్లీ అడుగుతున్నారని చెప్పారు. ఇది రాజకీయ కేసు అని, తప్పుడు కేసని, ఉద్దేశ పూర్వకంగా పెట్టిన కేసన్నారు. తన అరెస్టు పూర్తిగా చట్ట విరుద్ధమని తెలిపారు. కోర్టులో న్యాయపోరాటం చేస్తామన్నారు. కస్టడీ ముగియడంతో ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా శనివారం మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు.

### బెయిల్ పిటిషన్ దాఖలు చేశాం..

ఇప్పటికే బెయిల్ పిటిషన్ దాఖలు చేశామని కవిత తరపు నాయ్యవాది కోర్టుకు తెలిపారు. కస్టడీ పూర్తయిన రోజే బెయిల్ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరారు. బెయిల్ పిటిషన్‌పై ఈడీకి నోటీసులు ఇవ్వాలన్నారు. కవిత పిల్లలు మైనర్లని, వారిని కలిసేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. కేసులో ఉన్న మరికొన్ని అంశాలపై విచారణ జరపాలని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నలుగురి స్టేట్‌మెంట్లతో పాటు కిక్ బ్యాగ్స్ గురించి కవితను అడిగామని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో కోట్ల రూపాయలు చేతులు మారయన్నారు. డాక్టర్ల సూచనతో కవితకు మందులు, డైట్ ఇస్తున్నామని తెలిపారు. ఇరువర్గాల వాదనలు విన్న జడ్జి తీర్పును రిజర్వులో ఉంచారు.



# రేవంత్ రెడ్డీ.. నీస్థాయిని నీవే తగ్గించుకుంటున్నావ్...

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
రేవంత్ రెడ్డీ... బీఆర్ఎస్ నేతల ఇళ్లకు వెళ్లి... నీస్థాయిని నీవు తగ్గించుకుంటున్నావ్ అంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీ హనుమంత రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై ఆయన తీవ్రఅసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్‌ను కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ని గెలిపించారని పేర్కొన్నారు. అలాంటప్పుడు ఇప్పుడు బీఆర్ఎస్ నేతలను పార్టీలోకి ఎలా తీసుకుంటారు? అని ప్రశ్నించారు. వారిని పార్టీలోకి తీసుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నేతలకు అన్యాయం చేయవద్దని కోరారు. రేవంత్ రెడ్డి వెళ్లి బీఆర్ఎస్ నేతలను పార్టీలోకి ఆహ్వానించడం సరికాదన్నారు. ఆయన తనస్థాయిని తాను తగ్గించుకుంటున్నారన్నారు.

### ఇవన్నీ చెబుతామంటే టైమ్ ఇవ్వడం లేదు

రేవంత్ రెడ్డిని తాను కలిసి ఇవన్నీ చెబుతామంటే తనకు సమయం ఇవ్వడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై ప్రశంసలు కూడా కురిపించారు. తక్కువ సమయంలో పార్టీని బలోపేతం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించింది రేవంత్ రెడ్డేనని... అలాగే కేవలం నాలుగేళ్ళలోనే ముఖ్యమంత్రి అయిన వ్యక్తి కూడా ఆయనే అని కొనియాడారు. అలాంటి నీవు... ముఖ్యమంత్రివి అయి ఉండి వారి వద్దకు వెళ్లి ఆహ్వానించడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా డబ్బులు సంపాదించి ఇప్పుడు మనం అధికారంలో ఉన్నామని చెప్పి వాళ్లు మన వైపు వస్తున్నారని పార్టీ మారుతున్న నేతలను ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ కేడర్‌కు న్యాయం చేయకుండా మన వారిపై కేసులు పెట్టిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో తాము ఎక్కడకు వెళ్లినా కేసులు పెట్టారని మండిపడ్డారు. ఎప్పుడూ కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, వీటిని ఎత్తివేయాలని కోరారు. రేవంత్ రెడ్డి ఒకవైపు కాకుండా రెండువైపుల వినాలని కోరారు. తాను రేవంత్ రెడ్డికి వ్యతిరేకం కాదని, ఎవరికీ అన్యాయం జరగవద్దనేది తన ఉద్దేశ్యం అన్నారు.

# టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలి

## సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ లేఖ




**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
టెట్ పరీక్ష ఫీజును తగ్గించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ శనివారం బహిరంగ లేఖ రాశారు. పరీక్ష ఫీజు తగ్గించడం ద్వారా నిరుపేద అభ్యర్థులపై భారం తగ్గించాలన్నారు. టెట్ పరీక్ష నిర్వహణకు 33 జిల్లాల్లోనూ కేంద్రాలు ఇవ్వాలని కోరారు. గతంలో టెట్ పరీక్ష ఫీజు ఒక పేపర్‌కి రూ.200, రెండు పేపర్లకు రూ.300 ఉండేదని... కానీ ఇప్పుడు ఒక పేపర్‌కి రూ.1000, రెండు పేపర్లకు రూ.2000 పెంచడం వల్ల నిరుపేద అభ్యర్థులపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే పరీక్ష నిర్వహణ 11 జిల్లా కేంద్రాల్లోనే కాకుండా 33 జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. 11 జిల్లాల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తే మిగతా జిల్లాల విద్యార్థులు ఇబ్బందులు పడతారని తెలిపారు. వారికి దూరభారంతో పాటు ఆర్థికభారం కూడా అవుతుందన్నారు. కాబట్టి 7 లక్షల మంది నిరుద్యోగుల సమస్యను అర్థం చేసుకొని ఫీజులు తగ్గించాలని, పరీక్ష కేంద్రాలను 33 జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు.

# దమ్ము చూపే అవకాశంఇప్పుడే నీకే





**మార్చి 23 జర్నలిస్ట్ జర్నీ న్యూస్:**
రేవంత్ రెడ్డీ... కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరే దమ్ముందా? అని నీవు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడిగావ్ కదా... ఇప్పుడు అమిత్ షా, కేంద్రం అవసరం లేదు... ఆ దమ్ము చూపే అవకాశం నీకే వచ్చింది... ఇప్పుడు మీరే సీబీఐ దర్యాప్తుని అడగాలని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కోరగలరా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అవినీతిపై విచారణ చేయాలనే చిత్తశుద్ధి ఉంటే వాటిని కోల్డ్ స్టోరేజీలో పెట్టవద్దని... వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన మాటపై నిలబడాలన్నారు.కేజ్రీవాల్ అరెస్ట్‌ను కాంగ్రెస్ వాళ్లు ఖండిస్తున్నారని... కానీ కుంభకోణాల పార్టీ ఇలా చేయడంలో ఆశ్చర్యం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీని... కుంభకోణాలను వేరు చేసి చూడలేమన్నారు. కేసీఆర్ అవినీతిపై 100 రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారని.. రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనను సవాల్ చేశారని గుర్తు చేశారు.'కిషన్ రెడ్డి నీకు దమ్ముందా? అమిత్ షా అపాయింట్‌మెంట్ ఇప్పించు.. కాళేశ్వరంపై నా వద్ద సాక్ష్యాలు ఉన్నాయ్.. సీబీఐ దర్యాప్తు చేస్తే బీఆర్ఎస్ అక్రమాలు నిరూపిస్తాను.. లేదంటే రాజకీయ సన్యాసం తీసుకుంటాను' అని నాడు రేవంత్ రెడ్డి సవాల్ చేశారని... ఇప్పుడు అధికారం ఆయన చేతిలోనే ఉందని గుర్తు చేశారు. మీరు అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ ప్రాజెక్టుపై ఏం చేశారు? అని ప్రశ్నించారు. కళ్లముందే ఇంత అవినీతి కనిపిస్తుంటే కాంగ్రెస్ ఏం చేస్తోంది? అని నిలదీశారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని గతంలో కాంగ్రెస్... కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. అప్పుడే కేంద్ర జలశక్తి శాఖ సీబీఐ దర్యాప్తుకు అవకాశం లేదని చెప్పిందని... ఇప్పుడు రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చినందున సీబీఐ దర్యాప్తుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ ఆదేశిస్తే కేంద్రం 24 గంటల్లో మేడిగడ్డపై దర్యాప్తును ప్రారంభిస్తుందని స్పష్టం చేశారు.
వంద రోజులు పూర్తయ్యాక కాంగ్రెస్ పాలన చూస్తుంటే మాటలతో పూటగడిపే ప్రయత్నమే కనిపిస్తోందని ఆరోపించారు. గ్యారెంటీలపై, బీఆర్ఎస్ అవినీతిపై మాటలతో కాలం గడిపేస్తోందని విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూములకు సంబంధించి బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గతంలో అవినీతి ఆరోపణలు గుప్పించిందని గుర్తు చేశారు. ఇప్పుడు వారు చేసిన సెటిల్మెంట్‌లను బయటకు తీసి వీరు మళ్లీ సెటిల్మెంట్లు చేస్తున్నారని ఆరోపించారు. కంపెనీలను, బిల్డర్లను, రియల్ ఎస్టేట్ కంపెనీలను, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై దర్యాప్తుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు వారికి ఇచ్చారు కదా... ఇప్పుడు మాకూ ఇవ్వండి అని వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ మనుషులు ఆర్జీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అవినీతి విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందే అన్నారు. కుక్క తోక వంకర అన్నట్లు కాంగ్రెస్ మారదని... ఆ పార్టీ చరిత్రే అవినీతి అన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల హతం



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. శనివారం భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అలాగే ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారని తెలుస్తోంది.ఈ ఘటన బీజాపూర్ జిల్లాలోని పీడియా అటవీ ప్రాంతంలో జరిగింది. ఘటనాస్థలి నుంచి భద్రతా దళాలు భారీ మొత్తంలో మందుగుండు సామాగ్రి, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. కాగా, ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ముగ్గురు నక్సలైట్ల వివరాలను అధికారులు వెల్లడించలేదు. ఇదిలాఉంటే.. నాలుగు రోజుల క్రితం కూడా ఛత్తీస్‌గఢ్‌లోని చోటేతుంగాలి అటవీ ప్రాంతంలో కూడా ఎన్‌కౌంటర్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు హతమయ్యారు.

# ఢిల్లీ మద్యం కేసులో తెరపైకి మరో పేరు... కేసులో కీలకంగా వ్యవహరించిన కవిత సమీప బంధువుమేక శరణ్?

**మేక శరణ్ నివాసంలోనూ ఈడీ సోదాలు**
**కవితను అరెస్ట్ చేసిన రోజు ఆమె ఇంట్లోనే ఉన్న మేక శరణ్**
**అతని ఫోన్ సీజ్ చేసిన ఈడీ అధికారులు**



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
ఢిల్లీ మద్యం కేసులో మరో పేరు తెరపైకి వచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సమీప బంధువు మేక శరణ్ ఈ కేసులో కీలకంగా వ్యవహరించినట్లుగా ఈడీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల క్రితం కవితను ఆమె ఇంట్లో అరెస్ట్ చేసిన సమయంలో మేక శరణ్ అక్కడే ఉన్నట్లుగా చెబుతున్నారు. ఆయన ఫోన్‌ను కూడా సీజ్ చేశారు. ఈ క్రమంలో ఈరోజు ఉదయం నుంచి హైదరాబాద్‌లోని కవితకు చెందిన పలువురు బంధువులు, సన్నిహితుల ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. కొండాపూర్‌లోని మేక శరణ్, మాదాపూర్‌లోని కవిత ఆడపడుచు అఖిల నివాసంలో సోదాలు చేస్తున్నారు.మేక శరణ్‌ను ఇదివరకే రెండుసార్లు ఈడీ విచారణకు పిలిచింది. కానీ అతను హాజరుకాలేదు. సౌత్ లాబీ లావాదేవీల్లో అతను కీలకపాత్ర పోషించినట్లుగా ఈడీ అధికారులు చెబుతున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో ముడుపుల చెల్లింపుల వ్యవహారంలో బంధువుల పాత్రపై కూడా ఈడీ అధికారులు ఆరా తీస్తున్నారు. షెల్ కంపెనీల ద్వారా లావాదేవీలు జరిపినట్లుగా ఈడీ గుర్తించింది. ఈరోజు మొత్తం ఏడుగురు ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది

# అభ్యర్థుల ఖర్చుపై ఈసీ ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)
దీంతో పాటు రెండు లీటర్ల శీతల పానీయం బాటిల్ ధర రూ.90, శాఖాహారం ప్లేట్ రూ.80, నాన్ వెజిటేరియన్ ప్లేట్ ధర రూ.200గా ఉంచారు. అరలీటర్ వాటర్ బాటిల్ ధర రూ.10, లీటర్ రూ.20, రెండు లీటర్ రూ.30గా నిర్ణయించారు.

### ప్రమోషన్ రేట్లు కూడా




ఇండికా, వ్యాగన్‌ఆర్, టాటా సుమో, మారుతీ జిప్సీ నాన్‌ఏసీ ధరలను రోజుకు రూ.1100గా ఉంచగా, ఈ ఏసీ వాహనాలకు రోజుకు రూ.1210గా ఉంచారు. స్కార్పియో, టవేరా, ఇన్నోవా, బొలెరో నాన్ ఏసీ ధర రూ.1294గా, ఏసీ వాహనాలకు రోజుకు రూ.1815గా నిర్ణయించారు. ఆయిల్ లేని ట్రాక్టర్ ట్రాలీకి రోజుకు రూ.484, ఆయిల్ లేకుండా మోటార్ సైకిల్ ద్వారా ప్రచారం చేసేందుకు రోజుకు రూ.400, సైకిల్ పై ప్రచారం చేసేందుకు రోజుకు రూ.100 చొప్పున ధర నిర్ణయించారు. ఎయిర్ కండీషనర్‌తో కూడిన సింగిల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1650గా, డబుల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1810గా నిర్ణయించారు.

### రాష్ట్రాల వారీగా ఖర్చులో తేడా..

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రాల వారీగా కమిషన్ పర్యటిస్తున్నప్పుడు ఈ రేట్లు నిర్ణయించారు. అనంతరం ప్రతి జిల్లాలో అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి నిర్ణయించిన జాబితాను కచ్చితంగా పాటించాలని సీఈవోలందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇది ఇలా ఉంటే పోలింగ్ జరిగే మే 13న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ఇవ్వాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది.

---

# కేజ్రీవాల్ అరెస్టుపై ఆప్ సంచలన ఆరోపణలు

**అరబిందో ఫార్మా డైరెక్టర్ అరెస్టు విషయాన్ని ప్రస్తావించిన ఆప్**
**కేజ్రీవాల్ ను కలవలేదని అన్నందుకు అరెస్టు..**
**లిక్కర్ స్కాంపై కేజ్రీవాల్ తో మాట్లాడానన్న మరుసటి రోజే బెయిల్**
**ఈ కేసులో మనీ ట్రయల్ మొత్తం బీజేపీతోనే లింక్ ఉందని అతిషి ఆరోపణ**
**ఎలక్టోరల్ బాండ్ విరాళాల డేటా పరిశీలిస్తే తెలుస్తుందని కామెంట్**



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాంలో సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత, ఢిల్లీ మంత్రి అతిషి తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసులో ఆప్ నేతలకు అందినట్లు చెబుతున్న రూ.100 కోట్లకు సంబంధించి ఎలాంటి ఆధారాలను అధికారులు చూపలేదన్నారు. నిజానికి ఈ మనీ ట్రయల్ మొత్తం బీజేపీ చుట్టే తిరుగుతోందని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్స్ వివరాలను పరిశీలిస్తే ఇది స్పష్టంగా తెలుస్తుందని చెప్పారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కాం కేసులో గతంలో అరెస్టయి ప్రస్తుతం బెయిల్ పై ఉన్న అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రారెడ్డి బీజేపీకి పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చాడని తెలిపారు. అదికూడా ఈ కేసులో అరెస్టులు జరుగుతున్న సమయంలోనే ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేయడాన్ని అతిషి ప్రస్తావించారు.
శరత్ చంద్రారెడ్డి అరెస్టు, బెయిల్ కూడా నాటకీయంగా జరిగిందని మంత్రి అతిషి ఆరోపించారు. కేజ్రీవాల్ తో తనకు పరిచయమే లేదన్న మరుసటి రోజే ఆయనను ఈడీ అధికారులు అరెస్టు చేశారని, నెలల తరబడి జైలులో ఉన్న శరత్ చంద్రారెడ్డి తన స్టేట్ మెంట్ మార్చారని చెప్పారు. లిక్కర్ పాలసీ విషయంలో కేజ్రీవాల్ ను కలిసి మాట్లాడానని స్టేట్ మెంట్ ఇచ్చిన తర్వాతే ఆయనకు బెయిల్ మంజూరైందని చెప్పారు. శరత్ చంద్రా రెడ్డికి 2022 నవంబర్ 9న ఈడీ సమన్లు పంపిందని, కేజ్రీవాల్ తో కానీ, ఆప్ తో కానీ తనకెలాంటి సంబంధంలేదని ఆయన స్పష్టంగా చెప్పారని అతిషి తెలిపారు.
దీంతో ఆ మరుసటి రోజే శరత్ చంద్రారెడ్డిని ఈడీ అధికారులు అరెస్టు చేశారన్నారు. తన స్టేట్ మెంట్ మార్చుకున్న వెంటనే ఆయనకు బెయిల్ వచ్చిందని గుర్తుచేశారు. 2021 ఏప్రిల్ నుంచి 2023 నవంబర్ మధ్య కాలంలో అరబిందో ఫార్మా కంపెనీ సుమారు రూ.52 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్స్ కొనుగోలు చేసిందని మంత్రి అతిషి వివరించారు. ఇందులో సింహభాగం.. అంటే 66 శాతం నిధులు బీజేపీకే అందాయని ఎలక్టోరల్ బాండ్స్ వివరాల ద్వారా బయటపడిందని అతిషి పేర్కొన్నారు.

# చెక్ పోస్ట్ తనిఖీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్



**వర్ధన్నపేట, మార్చి23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ పరిధిలోని డీసీ తండా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ వద్ద విధి విధానాలను పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు నిభందనలు పాటిస్తూ భాద్యతలు నిర్వర్తించాలని ఆదేశించారు. వారి వెంట వర్ధన్నపేట ఏసిపి, సీఐ, ఎస్సై పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# తండా వాసులపై కుక్కల దాడి

## ఏడుగురికి గాయాలు



**వర్ధన్నపేట, మార్చి23(జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని తండాలలో పలువురిపై కుక్కలు దాడి చేశాయి. శనివారం డీసి తండా, ఎన్ఎస్ తండా, స్వామి తండాలోని ఏడుగురిపై దాడి చేయగా వారు గాయపడ్డారు. గాయపడిన వారిని గమనించిన ఇరుగు, పొరుగు వారు క్షతగాత్రులను చికిత్స కోసం వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్రమత్తమైన డాక్టర్లు వారికి ప్రాథమిక చికిత్స అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి క్షతగాత్రులకు సరైన వైద్య సేవలు అందించారు.







# డస్ట్ తరలిస్తున్న లారీలకు పెనాల్టీలు

**వర్ధన్నపేట, మార్చి 23(జర్నలిస్ట్ వార్త):**
డస్ట్ లోడుతో వెళుతున్న లారీలకు శనివారం వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ పెనాల్టీలు వేశారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం గత కొద్ది రోజుల నుంచి డస్ట్ లోడుతో వెళుతున్న లారీలు రామగుండం నుంచి కోదాడ వెళు తున్నాయని తెలిపారు. డస్ట్ లోడుతో వెళ్తున్న కారణంగా వరంగల్ ఖమ్మం ప్రధాన రహదారిపై డస్ట్ పడి వాహనదారులు, పాదచారులు, వ్యాపారస్తులు ఇబ్బందిపతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు లారీల డ్రైవర్లను మందలించడం జరిగిందన్నారు. అనంతరం లారీలకు సంబంధిత కాగితాలను పరిశీలించారు. ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల పట్ల వారికి అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరించిన లారీలకు పెనాల్టీలు విధించారు. డస్ట్ కారణంగా పట్టణ ప్రజలు, వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి లారీలు వారిని మందలించిన ఎస్సై పనితీరుపై స్థానికులు, వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.





# ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులు



**వర్ధన్నపేట, మార్చి23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామంలో అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను శనివారం ఎస్సై ప్రవీణ్ కుమార్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తవ్వకాల నిర్వహణపై నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేని అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట కానిస్టేబుళ్లు సురేష్, దామోదర్ ఉన్నారు.

# మంత్రి కొండా సురేఖతో ఎంపీ రంజిత్ రెడ్డి భేటీ

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శనివారం ఎంపీ రంజిత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు.., కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న విశ్వాసం, క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న తీరును ఎంపీ రంజిత్ రెడ్డి మంత్రికి వివరించారు.



# గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంగడి వేలం

రాయపర్తి, మార్చి23(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో వారాంతపు సంత(అంగడి) గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం వేలం వేశారు. వర్ధన్నపేట మండలం ల్యాబర్తి గ్రామానికి చెందిన చిన్నాల ధనుంజయ్ 1 లక్ష 10 వేల రూపాయలకు వేలం పాటపాడి సంతని దక్కించుకున్నారు. ఎంపిఓ తుల రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం ప్రతీ ఆదివారం ఈ సంత నిర్వహించబడుతుందని తెలిపారు. వేలం ద్వారా సంతను దక్కించుకున్న వారికి 1-4-2024 నుండి 31- 3-2025 వరకు అధికారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, కారొబార్ సురేష్, మాజీ సర్పంచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.ద

# కిష్టాపురం చెక్ పోస్ట్ తనిఖీ చేసిన సిపి అంబర్ కిషోర్ ఝా



**రాయపర్తి,మార్చి23(జర్నలిస్ట్ వార్త):**రాయపర్తి మండలం కిష్టాపురం క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా అధికారులు నిబంధనలకు కట్టుబడి పని చేయాలని ఆదేశించారు. వారి వెంట వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య, సిఐ సూర్యప్రకాష్, ఎస్సై వడ్డే సందీప్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# రెచ్చగొడితే అందుకు పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

## : సీఎం రేవంత్ రెడ్డికి మంద కృష్ణ హెచ్చరిక

**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
మాదిగలను రెచ్చగొడితే అందుకు పరిణామాలు తీవ్రంగా ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. మాజీ సీఎం కేసీఆర్‌లా సీఎం రేవంత్ రెడ్డి తమకు అన్యాయం చేస్తే ప్రత్యక్ష యుద్ధం ఉంటుందని... మాదిగల తిరుగుబాటు ఎలా ఉంటుందో భవిష్యత్తులో చూపిస్తామన్నారు.

శనివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ... మాదిగలు తనకు రాజకీయంగా అండగా నిలిచారని రేవంత్ రెడ్డి చెబుతుంటారని... మరి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమా? అని ప్రశ్నించారు. మాదిగలకు న్యాయం చేయాలని తాను అడిగితే... న్యాయం చేయకపోగా... తమ సామాజిక వర్గానికే చెందిన వ్యక్తితో కౌంటర్ ఇప్పించారని మండిపడ్డారు.కేసీఆర్ మాదిరిగా రేవంత్ రెడ్డి తప్పులు



చేస్తే ఆ ముఖ్యమంత్రి కుర్చీ కూడా పోతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్‌కు వెన్నుపోటు పొడిచింది రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. తన నల్ల కండువా ఎప్పుడూ మారలేదని... కానీ రేవంత్ రెడ్డి మెడలో ఎన్ని కండువాలు మారాయో తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. సంపత్ కుమార్‌కు టిక్కెట్‌పై ఢిల్లీకి వెళదామని చెప్పారని... కానీ చివరకు ద్రోహం చేశారని ఆరోపించారు. నాగర్ కర్నూల్ లోక్ సభ సీటును సంపత్ కుమార్‌కు కాకుండా మల్లు రవికి ఎందుకు ఇప్పించారో చెప్పాలన్నారు.

నిన్న సంపత్ కుమార్ మాట్లాడిన మాటలు ఆయన మనస్సులో నుంచి వచ్చినవి కావన్నారు. రేవంత్ రెడ్డి చిలుక పలుకులు సంపత్ నోట వచ్చాయని ఎద్దేవా చేశారు. సంపత్ ఎస్సీ వర్గీకరణకు పోరాటం చేసిన వ్యక్తి అని గుర్తు చేశారు. తాను బీజేపీకి మద్దతిస్తున్నాననే కారణంతో... మాదిగజాతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాళ్ల దగ్గర తాను ఉంచానని సంపత్ కుమార్ చెప్పడం సరికాదన్నారు. అంతకుముందు వైఎస్ రాజశేఖరరెడ్డికి కూడా మద్దతిచ్చానని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణకు సహకారం అందించేవారికి మద్దతిస్తానన్నారు.

2019 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి రేవంత్ రెడ్డి పోటీ చేసినప్పుడు మాదిగలు ఆయనకు మద్దతివ్వలేదా? కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకురాలు నిలబడితే ఆమెను గెలిపించేందుకు నేను మద్దతిచ్చాను... అంటే ఆయా సందర్భాలలో మా జాతిని వారి కాళ్ల వద్ద పెట్టినట్లు అవుతుందా? అని మండిపడ్డారు. తనకు రేవంత్ రెడ్డి నుంచి సమాధానం రావాలని డిమాండ్ చేశారు. తన ప్రతి గెలుపులో మాదిగల పాత్ర ఉందని చెప్పిన రేవంత్ రెడ్డి నాగర్ కర్నూలు టిక్కెట్‌ను ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. రేవంత్ ఇప్పటికైనా మాదిగల రుణం తీర్చుకోవాలన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో భూపాలపల్లి ఎఎస్పీ అరెస్టు

**మార్చి23(జర్నలిస్ట్ వార్త)భూపాలపల్లి :**
ఫోన్ ట్యాపింగ్ కేసులో భూపాలపల్లి ఎఎస్పి భుజంగరావును సిట్ అధికారులు శనివారం అరెస్టు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో డిఎస్పి ప్రణీత్ రావును సిట్ అధికారులు విచారణ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రణీత్ రావుతో కలిసి ఇంటెలీజెన్స్‌లో పనిచేసిన సమయంలో భుజంగరావు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ప్రణీత్ చెప్పడంతో అదుపులోకి తీసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చేస్తున్న పోలీసులు ఇద్దరు ఎఎస్పిలు తిరుపతన్న, భుజంగరావును విచారణకు పిలిచారు. ఉదయం నుంచి ఇద్దరిని విచారణ చేసిన అధికారులు, భుజంగరావును ఎనిమిది గంటల పాటు విచారణ చేసి సాయంత్రం అరెస్టు చేసినట్లు బంజారాహిల్స్ పోలీసులు చెప్పారు. ఎఎస్పి భుజంగరావును ఆదివారం న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చనున్నట్లు తెలిసింది. భుజంగరావు, ప్రణీత్ రావును ఎదురెదురుగా కూర్చొబెట్టి పోలీసులు విచారణ చేసినట్లు తెలిసింది.ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ప్రణీత్ రావు ఆరు రోజుల కస్టడీ ముగియడంతో ఆదివారం జడ్జి ఇంట్లో హాజరుపరచనున్నారు. మళ్లీ కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు కోరనున్నట్లు తెలిసింది. ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగానే ఎస్ఐబిలో పనిచేసిన పలువురు అధికారులు, కానిస్టేబుళ్లను సిట్ విచారణకు పిలుస్తున్నట్లు తెలిసింది. నోటీసులు ఇవ్వడంతో గతంలో ఇంటెలీజెన్స్‌లో పనిచేసిన ఎఎస్పి తిరుపతన్న బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. వీరితో పాటు బిఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో ఇంటెలీజెన్స్, ఎస్ఐబిలో పనిచేసిన వారిని విచారణకు పిలవనున్నట్లు తెలిసింది.



# తుక్కుగూడ నుంచే కాంగ్రెస్ శంఖారావం!

## ఏప్రిల్ మొదటివారంలో భారీ బహిరంగ సభహాజరుకానున్న మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ
## జాతీయస్థాయి మ్యానిఫెస్టో తెలుగు ప్రతి విడుదల అక్కడే



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని అగ్రనేతలతో ప్రారంభించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. ఏప్రిల్ మొదటివారంలో హైదరాబాద్ శివారు తుక్కుగూడలో భారీ బహిరంగ సభ నిర్వహణకు చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ సభకు హాజరుకానున్నారని తెలుస్తోంది. పార్టీ జాతీయస్థాయి ఎన్నికల మ్యానిఫెస్టో తెలుగు ప్రతిని ఈ సభలో అగ్రనేతలు విడుదల చేయనున్నారు.
గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని తుక్కుగూడలో 'విజయభేరి' బహిరంగ సభతోనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఆ సభలో అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ, ఖర్గే ప్రకటించిన గ్యారంటీ హామీలతో ఎన్నికల ప్రచారంలో ఊపువచ్చి విజయం సాధించినట్లు పార్టీ నేతలు గట్టిగా భావిస్తున్నారు. ఆ సెంటిమెంట్‌తో రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల ప్రచార సభలనూ అక్కడి నుంచే ప్రారంభించాలని పార్టీ యోచిస్తోంది. మొత్తం 17కి గాను 9 నియోజకవర్గాలకు అభ్యర్థులను కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. మిగిలిన 8 స్థానాలకు ఈ నెలాఖరుకల్లా ఖరారు చేయనుంది.

### ప్రచార వ్యూహంపై కసరత్తు

పార్టీ ప్రచార వ్యూహంపైనా సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. శనివారం తన నివాసంలో ఈ అంశంపై మంత్రులు, ఇతర నేతలతో చర్చించారు. తాను ఇంతకాలం ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలిచి తీరాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. అక్కడి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇతర నియోజకవర్గాల్లో ప్రచారంపైనా చర్చించారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారానికి విడివిడిగా ప్రణాళికలు రూపొందించి రాష్ట్ర ముఖ్య నేతలను పర్యవేక్షకులుగా నియమించేందుకు పీసీసీ కసరత్తు చేస్తోంది. పార్టీ గెలిచిన 64 అసెంబ్లీ స్థానాల్లో ఎమ్మెల్యేలు, మిగిలిన నియోజకవర్గాల్లో ఓడిన నేతల పర్యవేక్షణలోనే ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. టికెట్లు వచ్చిన అభ్యర్థులు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలతో కలిసి ప్రచార వ్యూహంపై చర్చిస్తున్నారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి మల్లు రవి శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణతో సమావేశమై ప్రచార కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు.
కాంగ్రెస్ ఎక్కువ స్థానాలను గెలిచే అవకాశం ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటి కావడంతో.. అధిష్ఠానం సైతం ఇక్కడ ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించింది. కర్ణాటకకు చెందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్వస్థలం పాత హైదరాబాద్ సంస్థానం పరిధిలోనే ఉంది. ఈ నేపథ్యంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అత్యధిక సీట్లను గెలుచుకోవాలని ఖర్గే పట్టుదలతో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# నేను చేరలేనంత దూరం కాదు... దొరకనంత దుర్గం కాదు
## : సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

**%సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన 317 జీవో బాధితులు**
**సీఎంను కలిసిన మహబూబ్ నగర్‌కు చెందిన రెవెన్యూ ఉద్యోగి దయాకర్**
**జీవో 317 ఇబ్బందులను సీఎంకు వివరించిన దయాకర్**
**ఎన్నికల తర్వాత ఇబ్బందులను పరిష్కరిస్తానని సీఎం హామీ**



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
తాను చేరలేనంత దూరం కాదు... దొరకనంత దుర్గం కాదంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. రేవంత్ రెడ్డిని శనివారం వివిధ కులసంఘాల ప్రతినిధులు కలిశారు. అలాగే 317 జీవో బాధిత ఉద్యోగులు కూడా కలిశారు. ఇందులో భాగంగా మహబూబ్ నగర్‌కు చెందిన రెవెన్యూ ఉద్యోగి దయాకర్ కలిశారు. జీవో 317 వల్ల ఇబ్బందులను ముఖ్యమంత్రికి వివరించారు. ఎన్నికలు ముగియగానే జీవో 317 ఇబ్బందులను పరిష్కరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఉద్యోగి దయాకర్ ముఖ్యమంత్రిని కలిసి ఆయన మెడలో కండువా కప్పి... పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఆ తర్వాత ఓ దరఖాస్తును ముఖ్యమంత్రి చేతికి ఇచ్చారు. తర్వాత ఆయనతో కలిసి ఫొటో దిగారు. ఇందుకు సంబంధించిన వీడియోను రేవంత్ రెడ్డి షేర్ చేస్తూ ట్వీట్ చేశారు. 'నేను%ాా% చేరలేని దూరం కాదు%ాా% దొరకనంత దుర్గం కాదు%ాా% సామాన్యుడి మనిషిని నేను%ాా% సకల జన హితుడను నేను.' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

# మాస్కోలో మారణకాండ

**కచేరీ హాల్‌లో దుండగుల కాల్పులు 150 మంది మృతి.. 145 మందికి గాయాలు**
**దాడి బాధ్యత తమదేనన్న ఇస్లామిక్ స్టేట్ 11 మంది దుండగుల పట్టివేత**



**మార్చి23(జర్నలిస్ట్ వార్త హైదరాబాద్:**
మాస్కో : మాస్కోలోని ఒక పెద్ద కచేరీ హాల్‌లోకి శుక్రవారం దుండగులు దూసుకువచ్చి, కాల్పులు జరపగా 150 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. మరి 100 మందికి పైగా క్షతగాత్రులు అయ్యారు. ఈ హింసాకాండ చాలదన్నట్లు ముష్కరులు ఆ మందిరానికి నిప్పు పెట్టారు కూడా. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన కొన్ని రోజులకే ఈ మారణ కాండ చోటు చేసుకోవడం గమనార్హం. ఈ దాడి తరువాత 11 మందిని నిర్బంధంలోకి తీసుకున్నట్లు రష్యా ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్ శనివారం అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు తెలియజేసింది. సోషల్ మీడియాలో అనుబంధిత చానెల్స్‌లో పొందుపరచిన ప్రకటనలో ఇస్లామిక్‌స్టేట్ (ఐఎస్) గ్రూప్ ఈ దాడికి తనదే బాధ్యత అని ఒప్పుకున్నది.
ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐఎస్ గ్రూప్ శాఖ మాస్కోలో దాడికి పథక రచన చేస్తున్న సంగతి తెలుసుకున్న యుఎస్ నిఘా విభాగం రష్యా అధికారులకు సమాచారం చేరవేసినట్లు అమెరికన్ నిఘా విభాగం అధికారి ఒకరు ఎపి వార్తా సంస్థతో చెప్పారు. దాడి అనంతరం దుండగులను ఏమి చేశారన్నది వెంటనే తెలియరాలేదు. కాని ప్రభుత్వ దర్యాప్తు అధికారులు ఉగ్రవాద ఘటనగా దర్యాప్తు చేస్తున్నారని తెలియవచ్చింది. కచేరీ హాల్‌ను భస్మీపటలం చేసిన ఈ దాడి రష్యాలో కొన్ని ఏళ్లలో అత్యంత దారుణ మారణకాండ. ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న పోరు మూడవ సంవత్సరంలోకి ప్రవేశించిన సమయంలో ఇది జరిగింది. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యనిన్ ఈ దాడిని 'భారీ విషాద ఘటన'గా పేర్కొన్నారు. మాస్కో పశ్చిమ శివారులోని పెద్ద సంగీత హాల్ క్రోకస్ సిటీ హాల్‌లోకి దుండగులు దూసుకువచ్చిన కొన్ని నిమిషాలకు పుతిన్‌కు దీని గురించి నివేదించినట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. ఆ హాలులో 6200 మంది కూర్చునే అవకాశం ఉంది. రష్యన్ రాక్ బ్యాండ్ పిక్నిక్ ప్రదర్శన కోసం జనం సమీకృతమైనప్పుడు ఈ దాడి చోటు చేసుకున్నది. దాడిలో 60 మందికి పైగా హతులైనట్లు ప్రభుత్వ అగ్రశ్రేణి దర్యాప్తు సంస్థ ఇన్వెస్టిగేటివ్ కమిటీ శనివారం తెల్లవారు జామున తెలియజేసింది. ఆరోగ్య శాఖ అధికారులు 145 మంది క్షతగాత్రుల జాబితా విడుదల చేశారు. వారిలో ఐదుగురు పిల్లలతో సహా 115 మందిని ఆసుపత్రిలో చేర్పించారు. దుండగులు పేలుడు పదార్థాలను విసిరిన తరువాత ప్రజ్వరిల్లిన మంటలలో మరింత మంది బాధితులు చిక్కుకుపోయి ఉండవచ్చునని కొన్ని రష్యన్ వార్తా సంస్థలు సూచించాయి. అగ్నిమాపక శాఖ హెలికాప్టర్లు ఆ భవనంపై నుంచి నీటిని విరజిమ్ముతూ మంటలను ఆర్పడానికి ప్రయత్నించడం వీడియోలో కనిపించింది. మంటలను నియంత్రించేందుకు కొన్ని గంటలు పట్టింది. సైనిక దుస్తులలో పలువురు వ్యక్తులు కచేరీ హాల్‌లోకి ప్రవేశించి జనంపై కాల్పులు జరిపారని ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది. హాలు వద్ద భద్రత విధులలో ఉన్న గార్డుల దగ్గర తుపాకులు లేవని, వారిలో కొందరు దాడి మొదలైన తరువాత మరణించి ఉండవచ్చునని రష్యన్ మీడియా తెలిపింది. ప్రత్యేక బలగాలు, రయట్ పోలీసులు వచ్చే లోపలే దుండగులు పారిపోయారని కొన్ని రష్యన్ వార్తా సంస్థలు తెలియజేశాయి. మాస్కో శివార్లలోని క్రాస్నోగార్స్క్‌లో 'క్రైస్తవుల' భారీ సమూహంపై తాము దాడి చేశామని ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ తెలిపినట్లు సంస్థకు చెందిన ఆమక్ వార్తా సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే, ఆ క్లెయిమ్ నిర్ధారణ వెంటనే సాధ్యం కాలేదు.

# ఉత్కంఠ పోరులో కోల్‌కతాదే విజయం

## సన్‌రైజర్స్‌ను ముంచిన ఆఖరి ఓవర్ క్లాసెన్ అద్భుత పోరాటం వృథా రసెల్ విధ్వంసం.. మెరిసిన హర్షిత్



ఈ సీజన్ పరాజయంతోనే మొదలు కాబోతోందని ఆ జట్టు అభిమానులు ఓ అంచనాకు వచ్చేశారు. కానీ విధ్వంసానికి మారుపేరైన హెన్రిచ్ క్లాసెన్ మాత్రం కాదు. ఒత్తిడిలో సిక్సర్ల మోత మోగిస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసేలా కనిపించాడు ఈ సఫారీ వీరుడు. 5 బంతుల్లో 7 పరుగులతో సమీకరణం తేలికైపోయింది. సన్‌రైజర్స్ గెలుపు లాంఛనమే అన్నట్లు ఆ జట్టు డగౌట్లో వాతావరణం తేలికైపోయింది. కానీ ఆఖరి 5 బంతుల్లో అద్భుతం చేసిన యువ పేసర్ హర్షిత్ రాణా కేవలం 2 పరుగులే ఇచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. మ్యాచ్‌ను కోల్‌కతా ఎగరేసుకుపోయింది. సన్‌రైజర్స్‌కు వేదనే మిగిలింది.
కొత్త కెప్టెన్ సారథ్యంలో, మారిన జట్టుతో సీజన్‌ను సరికొత్తగా ఆరంభించాలని చూసిన సన్‌రైజర్స్‌కు నిరాశ తప్పలేదు. శనివారం ఉత్కంఠభరితంగా సాగిన తన ఆరంభ మ్యాచ్‌లో హైదరాబాద్ 4 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో ఓటమి పాలైంది. మొదట కోల్‌కతా 7 వికెట్లకు 208 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆండ్రి రసెల్ (64 నాటౌట్‌బీ 25 బంతుల్లో 3ఐ4, 7ఐ6) సంచలన ఇన్నింగ్స్ ఆడాడు. ఫిల్ సాల్ట్ (54బీ 40 బంతుల్లో 3ఐ4, 3ఐ6) కూడా రాణించాడు. హైదరాబాద్ బౌలర్లలో నటరాజన్ (3/32), మయాంక్ మార్కండే (2/39) రాణించారు. అనంతరం ఛేదనలో సన్‌రైజర్స్ తడబడ్డప్పటికీ.. హెన్రిచ్ క్లాసెన్ (63బీ 29 బంతుల్లో 8ఐ6) అసాధారణ ఇన్నింగ్స్‌తో ఆ జట్టులో ఆశలు రేపాడు. కానీ ఆఖరి ఓవర్లో గొప్పగా బౌలింగ్ చేసిన హర్షిత్ (3/33).. కోల్‌కతాను గెలిపించాడు. ఆ జట్టు 7 వికెట్లకు 204 పరుగులే చేయగలిగింది.
క్లాసెన్ అద్భుతః: సన్‌రైజర్స్ ఓడిపోయి ఉండొచ్చు. కానీ ఈ మ్యాచ్‌లో క్లాసెన్ పోరాటం గురించి ఎంత చెప్పినా తక్కువే. తీవ్ర ఒత్తిడిలో తొణకకుండా అతను ఆడిన షాట్లు అసామాన్యం. కానీ ఆఖర్లో గురి తప్పిన ఒక్క షాట్ అతడి ఇన్నింగ్స్‌కు తెరదించి సన్‌రైజర్స్‌కు మ్యాచ్‌ను దూరం చేసింది. భారీ ఛేదనలో సన్‌రైజర్స్‌కు మయాంక్ అగర్వాల్ (32), ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ శర్మ (32) మంచి ఆరంభమే ఇచ్చారు. కానీ వీళ్లిద్దరూ వెనుదిరిగాక స్కోరు వేగం తగ్గింది. రాహుల్ త్రిపాఠి (20), మార్‌క్రమ్ (18) దూకుడుగా ఆడలేదు. సమద్ (15) సైతం నిరాశపరిచాడు. క్లాసెన్ సైతం వేగంగా ఆడలేకపోతుండటంతో హైదరాబాద్ భారీ తేడాతో ఓడబోతోందన్న అంచనాకు వచ్చేశారు అభిమానులు. కానీ 18 బంతుల్లో 60 పరుగులు చేయాల్సిన స్థితిలో హైదరాబాద్‌కు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బౌలింగ్ వరంలా మారింది. అతను వేసిన 18వ ఓవర్లో క్లాసెన్ 2 సిక్సర్లు బాదితే.. షాబాజ్ (16) ఓ సిక్సర్ అందుకున్నాడు. తర్వాత స్టార్క్‌కు చుక్కలు చూపించేశారు వీళ్లిద్దరూ. అతను వేసిన 19వ ఓవర్లో క్లాసెన్ తొలి నాలుగు బంతుల్లో మూడు సిక్సర్లు కొట్టాడు. చివరి బంతికి షాబాజ్ సిక్స్ బాదాడు. 6 బంతుల్లో 13 పరుగులతో సమీకరణం తేలికైంది. చివరి ఓవర్ తొలి బంతికే క్లాసెన్ 6 బాదడంతో కోల్‌కతా పనైపోయినట్లే అనిపించింది. కానీ తర్వాతి బంతికి క్లాసెన్ సింగిల్ తీయడం తప్పయింది. మూడో బంతికి షాబాజ్ ఔటైపోయాడు. నాలుగో బంతికి యాన్సెన్ సింగిల్ తీయగా.. హర్షిత్ వేగం తగ్గించి వేసిన 5వ బంతికి క్లాసెన్ షాట్ ఆడబోగా బంతి వికెట్ల వెనుక గాల్లోకి లేచింది. సుయాశ్ చక్కటి క్యాచ్‌తో క్లాసెన్ కథ ముగించాడు. చివరి బంతికి 5 పరుగులు అవసరం కాగా.. కమిన్స్ షాట్ ఆడడంలో విఫలమయ్యాడు.

# సునీల్ ఛెత్రి @150



దిల్లీ: దాదాపు రెండు దశాబ్దాల కింద అరంగేట్రం చేసిన భారత ఫుట్‌బాల్ స్టార్ సునీల్ ఛెత్రి మరో మైలురాయిని అందుకోనున్నాడు. మంగళవారం అఫ్గానిస్థాన్‌తో జరిగే ప్రపంచకప్ క్వాలిఫయర్ ఛెత్రికి కెరీర్‌లో 150వ అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 150 లేదా అంతకన్నా ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన 40వ ఫుట్‌బాలర్‌గా అతడు నిలవనున్నాడు. ఈ జాబితాలో పోర్చుగల్ సూపర్‌స్టార్ రొనాల్డో (205) మొదటి స్థానంలో ఉన్నాడు. అఫ్గాన్‌తో మ్యాచ్ సందర్భంగా ఛెత్రిని సన్మానిస్తామని అఖిల భారత ఫుట్‌బాల్ (ఏఐఎఫ్‌ఎఫ్) సమాఖ్య ప్రకటించింది. 39 ఏళ్ల ఛెత్రి 2005లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌తో అరంగేట్రం చేశాడు.

# టిల్లు గాడి బిజినెస్ బాగుంది.. ముందే టేబుల్ ప్రాఫిట్!



సిద్దు జొన్నలగడ్డ మరో సెంటిమెంట్ సక్సెస్ అందుకోవడానికి టిల్లు స్క్వేర్ సినిమాతో రెడీ అవుతున్నాడు. సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ సినిమాకు మల్లిక్ రామ్ దర్శకత్వం వహించాడు. ఇక అనుపమ పరమేశ్వరన్ ఈ మూవీలో లిల్లీ పాత్రలో నటిస్తోంది. ఆమె క్యారెక్టర్ మూవీలో చాలా బోల్డ్ గా ఉండబోతోందని తెలుస్తోంది. ఇప్పటి వరకు అనుపమ చేయనటువంటి క్యారెక్టరైజేషన్ ఈ చిత్రంలో చేసింది. టిల్లు స్క్వేర్ లో క్యారెక్టర్ ని ఎంచుకోవడానికి కారణం ఏంటనేది కూడా అనుపమ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. ఇక సినిమా నుంచి వచ్చిన టీజర్, సాంగ్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. హిట్ మూవీ సీక్వెల్ కావడంతో టిల్లు స్క్వేర్ పైన హైప్ క్రియేట్ అయ్యి ఉంది. మూవీ కంటెంట్ కూడా యూత్ కి కనెక్టఅయ్యేలా ఉందనే అభిప్రాయం టీజర్ చూసిన తర్వాత వస్తోంది. ఈ నేపథ్యంలో టిల్లు స్క్వేర్ మూవీ పై సాలిడ్ బిజినెస్ జరిగింది. ఈ మూవీ ఆంధ్రా రైట్స్ 12 కోట్ల రేషియోతో అమ్ముడయ్యాయి. అలాగే సీడెడ్ హక్కులు 3 కోట్ల రేషియోకి సోల్డ్ అయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా సినిమాపై 32 కోట్ల థియాట్రికల్ బిజినెస్ జరిగిందని తెలుస్తోంది. అలాగే మూవీ డిజిటల్ రైట్స్ ని నెట్ ఫ్లిక్స్ 30 కోట్లకి కొనుగోలు చేసింది. ఓవరాల్ గా 60 కోట్ల వ్యాపారం టిల్లు స్క్వేర్ మీద జరిగింది. అంటే సాలిడ్ టేబుల్ ప్రాఫిట్ తోనే సితారా, ఫార్చ్యూన్ ఫోర్ వారు ఈ సినిమాని థియేటర్స్ లో రిలీజ్ చేస్తున్నారు. డిజిటల్ రైట్స్ ద్వారానే పెట్టిన పెట్టుబడిలో మెజారిటీ షేర్ తిరిగి వచ్చేసిందని టాక్ వినిపిస్తోంది. ఈ మూవీ హిట్ అయితే సిద్దు జొన్నలగడ్డ మార్కెట్, బ్రాండ్ ఇమేజ్ కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నెల 29న మూవీ గ్రాండ్ గా థియేటర్స్ లోకి వస్తోంది. డీజే టిల్లు అయితే ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. అయితే టిల్లు స్క్వేర్ మీద భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. అసలైతే ఈ సినిమాను ఈ ఏడాది మొదట్లోనే విడుదల చేయాలని అనుకున్నారు. కానీ పర్ఫెక్ట్ ప్లాన్ తో ప్రమోషన్స్ చేసి సోలో డేట్ సెలెక్ట్ చేసుకోవాలని ఇంత కాలం ఆగారు. మరి ఆడియన్స్ ఎక్స్ పెక్టేషన్స్ ని టిల్లు ఎంత వరకు రీచ్ అవుతాడనేది వేచి చూడాలి. ఇక సిద్దు జొన్నలగడ్డ నీరజ కోన దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో మరో సినిమా చేస్తున్నాడు. అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ గానే ఈ చిత్రం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

# 34 ఏళ్లకు పిల్లలను కనాలనుకున్నా.. కుదర్లేదు : వరలక్ష్మీ శరత్ కుమార్



తన సినీ, వ్యక్తిగత జీవితం గురించి వరలక్ష్మీ శరత్ కుమార్ ఓ ఇంటర్వ్యూలో తాజాగా కీలక విషయాలు వెల్లడించారు. 18 ఏళ్ల వయసులోనే కథానాయికగా అవకాశం వచ్చిందని, కానీ చిన్న వయసులో సినిమాలు వద్దని తండ్రి శరత్ కుమార్ చెప్పడంతో మానుకున్నట్లు తెలిపారు. అది కూడా ప్రముఖ దర్శకుడు శంకర్ చిత్రం 'బాయ్స్'లో అని ఆమె చెప్పారు. ఆ తర్వాత 2012లో ధనుష్ సరసన 'పోడాపోడీ' మూవీతో హీరోయిన్‌గా తెరంగేట్రం చేసినట్లు పేర్కొన్నారు. విగ్నేష్ శివన్ దర్శకుడిగా పరిచయమైన ఈ సినిమా కమర్షియల్‌గా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దాంతో వరలక్ష్మీకి వెంటనే అవకాశాలు రాలేదు. దాంతో తెలుగు, కన్నడ సినిమాల్లో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని నటిగా నిరూపించుకున్నారు. ఆ తర్వాత బాలా డైరెక్షన్‌లో వచ్చిన 'తారై తప్పట్టై' చిత్రంతో నాయకిగా ఆమె మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక దక్షిణాదిలో సంచలన నటిగా ముద్ర వేసుకున్న ఆమె ఇప్పుడు ఎలాంటి పాత్రనైనా, ఏ భాషలోనైనా చాలా అలవొకగా నటించే స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం వరలక్ష్మీకి 38 ఏళ్లు. గత నెలలోనే వివాహ నిశ్చితార్థం చేసుకున్నారు. ముంబైకి చెందిన నిక్కోలాయ్ సచ్‌దేవ్‌ను ఆమె పెళ్లాడాబోతున్నారు. ముంబైలో ఆర్ట్ గ్యాలరీ నడుపుతున్న ఆయనతో వరలక్ష్మీ శరత్ కుమార్‌కు 14 ఏళ్ల స్నేహం ఉందట. అయితే, నిక్కోలాయ్ సచ్‌దేవ్‌కు ఇది రెండో పెళ్లి. మొదటి భార్యతో విడాకులు అయినట్లు సమాచారం. అయితే, తన సినిమా, వ్యక్తిగత జీవితం తాను చేసుకున్న ప్లాన్ ప్రకారం జరగలేదని ఆమె వాపోయారు. తన మొదటి చిత్రం 'పోడాపోడీ'లో నటించినప్పుడు తన వయసు 22 ఏళ్లు అని, ఎలాగైనా 28 ఏళ్లలోపు స్టార్ నటిగా ఎదగాలని భావించినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే 32 ఏళ్లలో పెళ్లి చేసుకుని 34 ఏళ్లలో పిల్లల్ని కనాలని ప్లాన్ చేసుకున్నానని, కానీ ఇప్పుడు తన వయసు 38 ఏళ్లు అని వరలక్ష్మీ శరత్ కుమార్ చెప్పారు. ఇలా తన సినీ, వ్యక్తిగత జీవితాల్లో వేసుకున్న ప్లాన్ వర్కౌట్ కాలేదని తెలిపారు. పోడాపోడీ మూవీ తర్వాత పర్సనల్ లైఫ్‌పై ఎక్కువగా దృష్టిపెట్టడమే తాను చేసిన పెద్ద తప్పుగా ఆమె పేర్కొన్నారు. అందువల్ల తన సినీ జీవితం బాధించిందన్నారామె. అప్పుడే తాను సినిమాలపై దృష్టి సారించి ఉంటే ఎక్కువ చిత్రాలు చేసి ఉండేదానినని అన్నారు.

# సినీ నటి సోనును అరెస్ట్ చేసిన పోలీసులు

**బాలికను దత్తత తీసుకున్నానని సోషల్ మీడియాలో తెలిపిన సోను**

**దత్తత నిబంధనల ప్రకారం వివరాలను వెల్లడించకూడదు**

**అమ్మాయిని ఇంట్లో పని కోసం తీసుకొచ్చి ఉంటుందని భావిస్తున్న పోలీసులు**



కన్నడ సినీ నటి, బిగ్ బాస్ ఫేమ్ సోను శ్రీనివాసగౌడను బ్యాడరహల్లి పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఉత్తర కర్ణాటకు చెందిన ఎనిమిదేళ్ల బాలికను దత్తత తీసుకున్నానని ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బాలికకు ముక్కు కుట్టించడం, భోజనం పెడుతున్న వీడియోలను అప్ లోడ్ చేసింది. దత్తత నిబంధనల ప్రకారం ఎవరిని దత్తత తీసుకున్నాం, ఎక్కడి నుంచి దత్తత తీసుకున్నాం అనే వివరాలను బయటకు వెల్లడించకూడదు. అయితే, ఇంట్లో పనులు చేయించేందుకు అమ్మాయిని ఆమె తీసుకువచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఆమెను అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఆమెను విచారిస్తున్నారు. మరోవైపు ఇన్స్టాగ్రామ్ లో ఆమెను ఫాలో అవుతున్న వారి సంఖ్య మిలియన్ వరకు ఉంది. గతంలో ఆమె మాల్దీవులకు వెళ్లినప్పుడు బికినీ ఫొటోలు షేర్ చేసింది. ఆ తర్వాత ఆమెకు పాప్యులారిటీ బాగా పెరిగింది. వేలల్లో ఉన్న ఫాలోయర్లు లక్షల్లోకి వెళ్లారు.

# అలా గట్టిగా ఫిక్సయ్యే ఈ సినిమా చేశా..!



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ కలిసి నటించిన సినిమా ఓం భీం బుష్. ప్రీతి, అయేషా ఖాన్ హీరోయిన్స్ గా నటించిన ఈ సినిమాను హర్ష డైరెక్ట్ చేశారు. శుక్రవారం రిలీజైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ తెచ్చుకుంది. సినిమా సక్సెస్ అయిన సందర్భంగా సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు మేకర్స్. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్ లో పాల్గొన్నారు. ఓం భీం బుష్ సక్సెస్ మీట్ లో శ్రీ విష్ణు ఎనర్జిటిక్ స్పీచ్ తో అలరించారు. కొత్త పాయింట్ తో తెరకెక్కించిన ఈ సినిమా కచ్చితంగా ఆడియన్స్ ను అలరిస్తుందని గట్టిగా ఫిక్స్ అయ్యే సినిమా చేశానని అన్నారు. ఓం భీం బుష్ కి వస్తున్న రెస్పాన్స్ గురించి చెప్పిన శ్రీ విష్ణు సినిమా ప్రేక్షకుల ఆదరణతో దూసుకెళ్తుందని అన్నారు. అంతేకాదు ఈ సినిమా చాలా రోజులు ఆడుతుందని అన్నారు. సినిమా సక్సెస్ లో మీడియా పాత్ర గురించి చెప్పిన శ్రీ విష్ణు సినిమాకు మంచి రివ్యూస్ ఇచ్చారు. రేటింగ్ కూడా బాగా ఇచ్చారని అన్నారు. డైరెక్టర్ హర్ష ఫస్ట్ టైం కథ చెప్పినప్పుడు ఇలాంటి కొత్త పాయింట్ చెప్పాలంటే చాలా నమ్మకం ఉండాలి. ఆ నమ్మకం హర్ష లో కనిపించింది. కథ చెప్పినప్పుడు దానితో పాటు కలిసి ట్రావెల్ చేస్తున్నప్పుడు ఇంకాస్త ధైర్యం వచ్చిందని అన్నారు శ్రీ విష్ణు. కథలు చెప్పే సినిమాలు వేరే ఉంటాయి. కానీ కొన్ని గొప్ప పాయింట్లు గురించి డిస్కస్ చేయాలంటే చాలా అరుదుగా దొరుకుతాయి. అవి దొరికినప్పుడు దాని చుట్టూ ఎంటర్టైన్మెంట్ అల్లి థియేటర్ లో నవ్విద్దాం అని గట్టిగా ఫిక్స్ ఈ సినిమా చేశామని అన్నారు శ్రీ విష్ణు. సినిమా కోసం డైరెక్టర్ హర్ష కొన్నిసార్లు 20, 30 టేకులు చేయించుకున్నా అతని స్టైల్ అది. అందుకే ఈరోజు సినిమా సక్సెస్ అయ్యింది. సినిమా కోసం మాకు మంచి ఫ్రీ హ్యాండ్ ఇచ్చాడు. ఇంకా ఫ్యూచర్ లో ఇంకా మంచి మంచి పాయింట్లతో సినిమాలు చేయాలని కోరుతున్నానని అన్నారు శ్రీ విష్ణు. తెలుగులో అంత డిఫరెంట్ పాయింట్స్ యాక్సెప్ట్ చేసే వాళ్లు ఎంతమంది ఉన్నారో తనకు తెలియదని కానీ హర్ష ఏ భాషలో సినిమా చేసినా సక్సెస్ అవుతాడని అన్నారు. కథ చెప్పిన తర్వాత తనతో పాటు రాహుల్, దర్శిలను కన్విన్స్ చేసి సుకొచ్చినప్పుడే సినిమా సక్సెస్ అని ఫిక్స్ అయ్యానని అన్నారు శ్రీ విష్ణు. ఇక సినిమా కోసం పనిచేసిన టెక్నిషియన్ టీం అందరి గురించి ప్రస్తావించారు. అందరి సహకారంతోనే సినిమా ఇలా వచ్చిందని.. ఈ సినిమా ఇంకా చాలా దూరం వెళ్తుందని.. చాలా రోజులు థియేటర్ లో ఆడుతుందని అన్నారు శ్రీ విష్ణు.